క్లుప్తంగా

ఉప ముఖ్యమంత్రికి ఘనస్వాగతం


భట్టికి స్వాగతం పలుకుతున్న నాయకులు

కడ్తాల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజక వర్గ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎంపీ డాక్టర్ మల్లురవికి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు గురువారం ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సన్మానించారు. అనంతరం పలు సమస్యలపై డిప్యూటీ సీఎంకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బీక్యానాయక్, బీచ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ 3, 4వ డివిజన్‌లలోని వేంకటేశ్వరకాలనీ, సీఎంఆర్ కాలనీల్లో గురువారం సీసీ, బీటీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను మేయర్ చిగురింత పారిజాత ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈఈ జ్యోతిరెడ్డి, కార్పొరేటర్లు రామిడి మాధురి వీరకర్ణారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సంరెడ్డి వెంకట్‌రెడ్డి, నాయకులు దిండు శ్రీనివాస్‌గౌడ్, ఏదుళ్ల ప్రతాప్‌రెడ్డి, రామిడి శూరకర్ణారెడ్డి, జెల్లా రమేశ్‌గౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమంగా నిర్మిస్తున్న షెడ్‌ను కూల్చివేస్తున్న కార్పొరేషన్ అధికారులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లో సర్వే నంబర్ 180/ఏలో 11 వందల గజాలలో అక్రమంగా నిర్మించిన షెడ్‌ను గురువారం నేలమట్టం చేశారు. కమిషనర్ సరస్వతి ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారి లాలప్ప ఆధ్వర్యంలో కూల్చివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కార్పొరేషన్ అనుమతి లేకుంగా ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే మున్సిపాలిటీ చట్టం-2019 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించిన నిర్మాణ దారు లపై క్రిమినల్ కేసులు నమోదుచేస్తామని హె చ్చరించారు. బడంగ్‌పేట్ నగర పాలకసంస్థ పరిధిలోని ప్రజలందరూ కార్పొరేషన్ అనుమ తి తీసుకుని నిర్మాణాలు చేపట్టాలని కోరారు.

పోలీసుల ముమ్మర తనిఖీలు

కడ్తాల్: మండల కేంద్రంలోని పలు కిరాణా దుకాణాలు, ఫామ్ హౌస్‌ల్లో సీఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ముమ్మ రంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. కిరాణా దుకాణాల్లో గుట్కా, మద్యం విక్రయించినా, ఫాంహౌస్‌లలో అనుమతి లేకుండా మద్యం వినియోగించినా.. అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోదాల్లో పలు కిరాణా షాపుల్లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఉపాధిలో రైతులకు ప్రాధాన్యత


నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కొందుర్గు: మండలంలోని అన్ని గ్రామాల్లో 2025-26 సంవత్సరంలో ఉపాధిహామీ పథకంలో చేపట్టబోయే పనుల ప్రణాళికను సిద్ధం చేయాలని జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో పాటు ఉపాధి సిబ్బందితో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రణాళికలో రైతులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ హన్మంత్‌రెడ్డి, డీటీ భాస్కర్, ఏఈ వంశీకృష్ణ, శ్రీకాంత్, ఏఓ రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

యువత చూపు.. రాజకీయాల వైపు

రాజకీయాల్లోకి వచ్చేందుకు కొత్తరక్తం ఉరకలేస్తోంది. పల్లెపోరు బరిలో దిగేందుకు యువత సిద్ధమవుతోంది. రాజకీయ వారసత్వం ఉన్నవారితో పాటు.. కొత్తవారు సైతం ఇప్పటి నుంచే ప్రజాక్షేత్రంలో తమకంటూ గుర్తింపు తెచ్చుకునేందుకు తహతహలాడుతున్నారు. విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

- పల్లెపోరుకు సిద్ధమంటున్న యువతరం
- ప్రజాసేవలో పరుగులు..
- విస్తృతంగా సేవా కార్యక్రమాలు
- రిజర్వేషన్లపై ఆందోళన



యాచారం: 'యువత రాజకీయాల్లోకి రావాలి. వారి చేతుల్లోనే దేశ భవిష్యత్తు' అని మేధావుల సూచన మేరకో.. ప్రజాసేవ చేయాలన్నా తాపత్రయమే కాని.. నవతరం రాజకీయాల వైపు మొగ్గు చూపుతోంది. నిన్నమొన్నటి వరకు రాజకీయాలు మనకెందుకులే అనుకున్న, అనుకుంటున్న వారు సమాజ సేవలో తరించేందుకు ముందుకు వస్తున్నారు. అందుకు వేదికగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు తీవ్ర కసరత్తు చేస్తున్నారు. ఏదో ఒక ప్రభుత్వ ఉద్యోగం, ప్రైవేటు ఉద్యోగమో సాధించి, జీవితంలో స్థిరపడాలనుకే వారు సైతం పంచాయతీ ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఇప్పటి వరకు ఏ రాజకీయ పార్టీతోనూ ఎలాంటి సంబంధం లేకపోయినప్పటికీ.. ఒంటరిగానైనా పోరాటం చేయాలనుకునే వారు లేకపోలేదు.

రిజర్వేషన్లపై ఆందోళన

రాజకీయాలపై ఆసక్తితో ఉన్నవారితో పాటు.. ఇప్పటికే సర్పంచిగా, ఎంపీటీసీగా పనిచేసిన వారు సైతం రిజర్వేషన్లపై ఆందోళన చెందుతున్నారు. సంక్రాంతి పండుగ తర్వాత స్థానిక ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. కేసీఆర్ సర్కార్ హయాంలో రెండు దఫాలుగా(సర్పంచులు, ఎంపీటీసీ పదవులకు) ఒకే రిజర్వేషన్లు ఉంటాయని, ఇద్దరు పిల్లలకంటే ఎక్కువ మంది ఉన్న వారు సైతం పోటీ చేసే అవకాశం ఉంటుందన్న నేపథ్యంలో ఆశతో కొందరు సేవా కార్యక్రమాలు చేస్తుండగా, రేవంత్ సర్కార్.. రిజర్వేషన్లు మారుస్తామని, గతంలో ఇద్దరు పిల్లలున్న వారు మాత్రమే పోటీకి అర్హులంటూ ప్రకటించింది. దీంతో కొందరి ఆశలు అడియాశలయ్యాయి. మరికొందరు రిజర్వేషన్లు ఎలా వస్తాయోనని ఎదురు చూస్తున్నారు.

ప్రజాసేవలో పరుగు

ప్రత్యక్ష రాజకీయాల్లో అడుగు పెట్టాలనుకుంటున్న వారిలో కొత్తవారితో పాటు.. స్వచ్ఛంద సంస్థల పేరిట ఇప్పటికే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారు అనేక మంది ఉన్నారు. రూ.లక్షలు ఖర్చు పెడుతూ.. ప్రజాసేవ చేస్తూ.. ప్రజలకు సుపరిచితులుగా చాలా మందే ఉన్నారు. మండల పరిధి నక్కర్తమేడిపల్లి, మాల్, మొండిగౌరెల్లి, గునుగల్, గడ్డమల్లయ్యగూడ. కొత్తపల్లి, నల్లవెల్లి, మంతన్‌గౌరెల్లి, చింతుల్ల, కిషన్‌పల్లి తదితర గ్రామీణ ప్రాంతాల్లో పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు పట్టుచీరలు, బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఆలయాల నిర్మాణాలకు, తాగునీటి, విద్యుత్ సమస్యల పరిష్కారం, తదితర వాటికోసం విరాళాలు అందజేస్తున్నారు. కుల సంఘాలకు, పేద కుటుంబాలకు అండగా, ఆసరాగా నిలుస్తున్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు టోర్నీలు నిర్వహిస్తున్నారు.


మంతన్‌గౌరెల్లిలో పేద యువతి వివాహానికి పట్టుచీర, బియ్యం అందజేస్తున్న నాయకులు

గురుకులాలపై అవగాహన కల్పించండి

టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు నాయక్

యాచారం: ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాల కోసం పేద విద్యార్థుల్లో చైతన్యం కల్పించి, చేర్పించేలా కృషి చేయాలని టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు నాయక్ సూచించారు. టీచర్లతో కలిసి గురువారం స్థానిక ఉన్నత పాఠశాల, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లోని అధికారులు, రాజకీయ నేతలను కలిసి వివరించారు. 2025- 26 ఏడాదికి ప్రవేశాల కోసం పేద తల్లితండ్రులతో పాటు విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు. అందుకు తహసీల్దార్ కార్యాలయ అధికారులు దరఖాస్తులకు కావాల్సిన సర్టిఫికెట్లను వెంటనే మంజూరు చేయాలని సూచించారు. ప్రవేశాల దరఖాస్తులు నింపే విధానంపై ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టీచర్లు యాదయ్య, వాసవి, పాండునాయక్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న టీచర్లు

ఇళ్ల ముట్టడిని జయప్రదం చేయండి

కందుకూరు: సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఆశవర్కర్లు చేపట్టనున్న మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం కందుకూరు పీహెచ్‌సీలో వైద్యురాలికి ఆశవర్కర్లు విధులకు గైర్హాజరవుతున్నారని తెలుపుతూ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆశవర్కర్లు 20 ఏళ్లుగా గ్రామాల్లో ఎంతో సేవ చేస్తున్నా కనీస ఉద్యోగ భద్రత కరువైందన్నారు. సర్వేల పేరుతో ప్రభుత్వం వారితో వెట్టిచాకిరీ చేయించడం వరకే పరిమితమైందని విమర్శించారు. నెలకు రూ.18వేల వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, బీమా, ఈఎస్‌ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేసేలా ఆశలు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మహేశ్వరం మండల కన్వీనర్ శేఖర్, ఆశవర్కర్లు ముంతాజ్, అప్రోచ్, శ్రీలత, జయసుధ, ప్రేమలత, అనిత, సురేఖ, సంధ్య, గీత తదితరులు పాల్గొన్నారు.


వైద్యురాలికి వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు, ఆశవర్కర్లు

క్రీడాకారులను ప్రోత్సహించాలి

కడ్తాల్: గ్రామీణా క్రీడాకారులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలని ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు, కేపీఎల్ సీజన్- 03 టోర్నీ స్పాన్సర్ గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో నారాయణరెడ్డి స్మారకార్థం 9 రోజులుగా నిర్వహిస్తున్న కడ్తాల్ ప్రీమియర్‌లీగ్ క్రికెట్ పోటీలు తుదిదశకు చేరుకున్నాయని తెలిపారు. శుక్రవారం ఫైనల్ నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, పీసీసీ సభ్యుడు బాలాజీసింగ్ రానున్నారని వెల్లడించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, టోర్నీ ఆర్గనైజర్స్ అనిల్‌గౌడ్, వెంకటేశ్, వరిక్పుల రాజు, సంతోష్, మహేశ్, మహేందర్‌రెడ్డి, దేవేందర్‌గౌడ్, మూడరవి, నర్సింహ, ముత్తి కృష్ణ, ఇమ్రాన్ ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

ఉత్తర ద్వార దర్శనం నేడు

అబ్దుల్లాపూర్‌మెట్: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లి శ్రీకోదండ రామచంద్రస్వామి, గండిచెరువులో శ్రీ రంగనాథ స్వామి ఆలయాల్లో శుక్రవారం ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వెల్లడించారు.

తుర్కయంజాల్‌లో..

తుర్కయంజాల్: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని పురపాలక సంఘం పరిధి తొర్రూర్ రంగనాథ స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని పేర్కొన్నారు. శనివారం లక్ష పుష్పార్చన నిర్వహించనున్నామని, భక్తులు ఎవరైనా పూలు సమర్పించవచ్చని పేర్కొన్నారు.

దివ్యాంగులకు ఉచిత బస్ పాసుల పంపిణీ

కడ్తాల్: మాజీ ఎంపీటీసీ అద్దాల రాములుగౌడ్ సహకారంతో హైదరాబాద్-2 డిపోనకు చెందిన అధికారులు.. 40 దివ్యాంగులకు ఉచిత బస్ పాసులు అందజేశారు. గురువారం మండల పరిధి చరికొండ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిపో అధికారి శివరాజు, నాయకులు యాదయ్య, చంద్రయ్య, మహేందర్‌గౌడ్, బుచ్చయ్య, యాదయ్య, హరిచంద్ర, మహేశ్, జగన్‌గోపాల్, ముత్యం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీసాయి ఆప్టికల్స్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పుష్పగిరి కంటి ఆస్పత్రి సహకారంతో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా ఆప్టికల్స్ కంటి వైద్య సహాయకుడు కొ్ట్ర మల్లేశ్, కంటి ఆస్పత్రి సిబ్బంది ఆధ్వర్యంలో 84 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 26 మందిని కంటి ఆపరేషన్ నిమిత్తం కంటి దవాఖానకు పంపించారు. కార్యక్రమంలో శ్రావణి, గీత, షబానా పాల్గొన్నారు.

ఆశల సమస్యలు పరిష్కరించని ప్రభుత్వం


పీహెచ్‌సీ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న ఆశలు

నేడు ఎమ్మెల్యే కార్యాలయం ముట్టడి: సీఐటీయూ కన్వీనర్ పెంటయ్య

ఆమనగల్లు: ఆశ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 10న కల్వకుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడిస్తున్నట్లు ఆమనగల్లు ఏరియా సీఐటీయూ కన్వీనర్ పెంటయ్య తెలిపారు. గురువారం తలకొండపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశలతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ.. ఆశల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యకర్తలను రెగ్యులర్ చేయాలని, రూ.18 వేలు కనీస వేతనం అందించాలని డిమాండ్ చేశారు. క్యాంపు కార్యాలయం ముట్టడికి ఆశలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఆశ సంఘం నాయకులు శిరీష, యాదాబాయి, పద్మ, నిర్మల, కవిత తదితరులు ఉన్నారు.

ముక్కోటికి ముస్తాబు


ముస్తాబైన వేంకటేశ్వరస్వామి దేవాలయం

- వేంకటేశ్వరుడి సన్నిధిలో ఘనంగా ఏర్పాట్లు
- ఉదయం నుంచే బారులు తీరనున్న భక్తులు


మత్స్యావతారంలో స్వామివారి దర్శనం

ముస్తాబైన వేంకటేశ్వరస్వామి దేవాలయం

మీర్‌పేట: దేశంలోనే ఉత్తర ద్వారంలో వెలసిన ఏకైక దేవాలయంగా ప్రసిద్ధి గాంచిన మీర్‌పేట జిల్లెలగూడలోని శ్రీ మత్స్యావతార వేంకటేశ్వరస్వామి దేవాలయం ముక్కోటి ఏకాదశికి ముస్తాబైంది. శతాబ్దాల చరిత్ర కలిగి ఉండడంతో పాటు ఎల్లప్పుడూ స్వామివారు ఉత్తర ద్వారం ద్వారా దర్శనమిచ్చే ఏకైక దేవాలయం కావడం ఇక్కడి విశిష్టత. అదేవిధంగా స్వామివారు మత్స్యావతారంలోని విష్ణువు దేహంలా ఉండగా, శిరస్సు లింగాకారంలో ఉండటం మరో విశేషం. మీర్‌పేటతో పాటు నగరం నలు మూలల నుంచి భక్తులు ఏటా వైకుంఠ ఏకాదశికి ఆలయానికి పెద్దఎత్తున తరలివచ్చి, స్వామి వారిని దర్శించుకుంటారు.

ప్రత్యేక ఆకర్షణగా నేలమాళిగలు..

సుమారు 500 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ దేవాలయంలోని నేలమాళిగలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. గతంలో ఆలయం శిథిలావస్థకు చేరుకోగా, శాఖా అధికారులు, డైరెక్టర్లు చొరవ తీసుకుని నేలమాళిగలను అందుబాటులోకి తెచ్చారు. దేవతా మూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేయడంతో పాటు భక్తులు దర్శించుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేయడంతో స్వామి వారిని దర్శించుకున్న అనంతరం భక్తులు నేలమాళిగలోని దేవతా మూర్తులను దర్శించుకుంటారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం

ఎంతో ప్రత్యేకత, చరిత్ర కలిగిన ఆలయాన్ని వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశాం. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనానికి వస్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా క్యూలైన్లు సిద్ధం చేశాం. దీంతో పాటు బందోబస్తు నిర్వహించాలని మీర్‌పేట ఇన్‌స్పెక్టర్‌ను కోరాము. వేడుకలకు ఆహ్వానించాం.

–శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి

కల్యాణ వైభోగమే..

- రెండోరోజు కొనసాగిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు
- స్వామివారి కల్యాణోత్సవానికి భారీగా హాజరైన భక్తులు

మొయినాబాద్‌రూరల్: ముత్యాల పందిరి, పచ్చని మామిడి తోరణాల అలంకరణతో శ్రీ దేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. గురువారం మండల పరిధిలోని కనకమామిడి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి బ్రహోత్సవాల్లో భాగంగా రెండోరోజు కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు, అర్చకుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారి కల్యాణం జరిపించగా.. ఆలయ చైర్మన్ కొండా లక్ష్మీకాంత్‌రెడ్డి తలంబ్రాలు, పూలు సమర్పించారు. ఈ కల్యాణ మహోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు స్వామివారి దర్శనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. దీంతో దేవాలయం భక్తులతో కిటకిటలాడింది.

నేడు వైకుంఠ ద్వార దర్శనం..

వేంకటేశ్వరస్వామి ఉత్తర దర్శనాన్ని శుక్రవారం ఉదయం 5 గంటలకు ప్రారంభిస్తామని ఆలయ చైర్మన్ కొండా లక్ష్మీకాంత్‌రెడ్డి, ప్రధాన అర్చకుడు పరంకుశ నరేంద్రచార్యులు తెలిపారు. భక్తులు క్యూలో ఉండి స్వామివారిని దర్శించుకోవాలని, భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని వారు పేర్కొన్నారు.


కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

ఎస్సీ వర్గీకరణే జేఏసీ లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ నేతలు

- భవిష్యత్ తరాలకోసం లక్ష డప్పులతో పోరాడుదాం
- మాదిక జేఏసీ నాయకులు

యాచారం: ఏబీసీడీ, ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా మాదిగ, మాదిగ ఉపకులాలంతా సమష్టిగా కృషి చేద్దామని మాదిగ జేఏసీ మండల అధ్యక్షుడు బోడ కృష్ణ పిలుపునిచ్చారు. మన పిల్లల భవిష్యత్తు కోసం ఫిబ్రవరి 7న లక్ష డప్పులతో తరలివెళ్లి సత్తా చాటుదామన్నారు. గురువారం మండల పరిధి గునుగల్ గ్రామంలో నిర్వహించిన సమావేశంలో జేఏసీ నేతలు మాట్లాడారు. ఏబీసీడీ, ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని సుప్రీం కోర్టు ఆదేశాలు ఇచ్చినా అమలు కాలేదని పేర్కొన్నారు. రిజర్వేషన్ల కోసం 30 ఏళ్లుగా పోరాటం చేస్తున్నామని, 2004లో నాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఎస్సీ వర్గీకరణ అమలు చేశారని, ఫలితంగా ఉమ్మడి రాష్ట్రంలో వేలాది మంది మాదిగలకు ఉద్యోగాలు, పదోన్నతులు లభించాయని వెల్లడించారు. అనంతరం జేఏసీ మండల కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా జోగు అంజయ్య, కార్యదర్శిగా కొమ్ము విష్ణులను నియమించారు. సమావేశంలో నాయకులు కంబాలపల్లి భాస్కర్, కృష్ణ, యాదయ్య, అశోక్, ఈశ్వర్, సతీష్, అబ్బయ్య, స్టాలిన్, రవీందర్, అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి గొంతులతో..

ఇబ్రహీంపట్నం రూరల్: ఎస్సీ వర్గీకరణ అయ్యే వరకు పోరాటం చేస్తామని మాదిగ జేఏసీ రంగారెడ్డి జిల్లా గౌరవ అధ్యక్షుడు బోసుపల్లి ప్రతాప్ అన్నారు. లక్ష డప్పులు వెయ్యి గొంతులతో ఏబీసీడీ వర్గీకరణ సాధనకు ఫిబ్రవరి 7న లక్షలాది మంది తరలిరావాలని పిలుపునిచ్చారు. ఉప్పరిగూడ అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడు భాస్కర్‌తో కలిసి మాట్లాడారు. మాదిగ ఉప కులాల ఉద్యోగులు ప్రమోషన్లు లేక ఇబ్బంది పడుతున్నరని, వారికి న్యాయం జరగాలంటే.. వర్గీకరణ జరగాల్సిందేనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని నియమించారు. జేఏసీ చైర్మన్‌గా చంద్రపాల్, వైస్ చైర్మన్‌గా మోహన్, నర్కుడి మహేందర్, కొంగరి జంగయ్య, నల్ల రాములు, కమిటీ సభ్యులుగా నర్సింహ, నరకుడి నర్సింహ, మల్లేశ్, పెంటయ్య, కృష్ణ, రఘు, నల్లోల్ల నర్సింహలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


ఇబ్రహీంపట్నం రూరల్: డప్పులతో సభ నిర్వహించిన జేఏసీ నాయకులు

రైతు సంక్షేమానికే సహకార సంఘాలు


రైతు కుటుంబానికి చెక్కు అందజేస్తున్న చైర్మన్ సత్తయ్య తదితరులు

తుర్కయంజాల్: రైతు సంక్షేమానికే సహకార సంఘాలు పనిచేస్తున్నాయని టిస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. తుర్కయంజాల్ సంఘం పరిధి కొహెడకు చెందిన రైతు కోట్ల బాబుగౌడ్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఈ సందర్భంగా గురువారం సంఘం తరపున ఆయన రూ.25వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, లక్ష్మమ్మ, సంజీవ రెడ్డి, కృష్ణారెడ్డి, యాదగిరి, సంఘం సెక్రటరి వై.రాందాసు తదితరులు పాల్గొన్నారు.